ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలి

రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్



మంతెనలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, వేదికపై నాయకులు

కంకిపాడు: సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మండలంలోని మంతెన గ్రామంలో జగనన్నకు మద్దతుగా జోగన్న గెలుపు కోసం మంతెన గ్రామం సిద్ధం కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. చంద్రబాబు కుట్రలు, పవన్ నయవంచనలు రాష్ట్రానికి శాపంగా పరిణమించాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండటాన్ని కూటమి ఓర్వలేకపోతుందన్నారు. ఎల్లో మీడియాతో ములాఖత్ అయ్యి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాయన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దించాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని, వైఎస్సార్ సీపీ విజయంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వీరంకి వెంకటరమణ, పిన్నబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ఉప్పలూరి శాంతి, కోనా కిషోర్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, నాయకులు కలపాల వజ్రాలు, తంబాబత్తుల ఓంకారం, లాం సురేష్, వీరంకి అయ్యన్నబాబు, రాజులపాటి శివబ్రహ్మేశ్వరరావు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించుకుందాం.. పథకాలు కాపాడుకుందాం..

పెనమలూరు: ఎన్నికల్లో జగనన్నను తిరిగి సీఎంగా గెలిపించి సంక్షేమ పథకాలను కాపాడుకుందామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. పెనమలూరు గ్రామంలో గురువారం మంత్రి జోగి రమేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు జగనన్న ఇచ్చిన వాగ్దానాలకు ప్రజలు ఓట్లు వేసి సీఎంగా చేశారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జగనన్న నవరత్నాలు అమలు చేసి అనేక సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందించారని తెలిపారు. సంక్షేమ పథకాలతో సామాజిక న్యాయం చేకూర్చారన్నారు. జగనన్నను ఈ ఎన్నికల్లో కూడా గెలిపిస్తే సంక్షేమ పథకాలు దిగ్విజయంగా కొనసాగుతాయన్నారు. వేరే ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు రద్దు చేస్తారని చెప్పారు. ప్రజలు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోని జగనన్నను గెలిపించాలని కోరారు.



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి జోగి రమేష్, కేడీసీసీబీ చైర్‌పర్సన్ పద్మావతి

చంద్రబాబు మోసగాడు..

ప్రతిపక్ష కూటమి నాయకుడు చంద్రబాబు మోసగాడని అతనిని ప్రజలు పొరపాటున నమ్మరాదని మంత్రి జోగి రమేష్ అన్నారు. 2014లో చంద్రబాబు సీఎం అయిన సమయంలో అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశాడని గుర్తు చేశారు. మరలా ఇప్పుడు అధికార దాహంతో ఆచరణ యోగ్యం కాని హామీలు ప్రకటిస్తూ ప్రజల ముందుకు వస్తున్నాడని, ప్రజలు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చంద్రబాబు బడాబాబులకు, పెత్తందారులకు మాత్రమే పని చేస్తాడని, పేదల సంక్షేమం అతనికి పట్టదన్నారు. ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి జగనన్నకు ఘన విజయం చేకూర్చి పెట్టాలన్నారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, గ్రామ సర్పంచ్ లింగాల భాస్కరరావు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు శీలం శ్రీరాములు, మాదు శ్రీనివాసరావు, కొడాలి సుష్మా, మరీదు నరేష్, గురుప్రసాద్, వీరంకి రాఘవులు, మాణిక్యాలరావు, తెన్నేటి ప్రకాష్, పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ



పెనమలూరు: జాతీయ స్థాయిలో జరిగిన చిత్రలేఖన పోటీల్లో పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మలినేని సుమలత గురువారం వివరాలు తెలుపుతూ ఉగాది పండుగ సందర్భంగా నెల్లూరు అమీర్‌జాన్ అకాడమీ, విజయవాడ డీమ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ, ఏపీ కల్చరల్ కమిషన్ సంయుక్తంగా విజయవాడలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎ.మణికంఠ, జె.చరణ్‌కుమార్, పి.వరుణ్, కె.నాగమణి, వి.భార్గవి బంగారు పతకాలు, బి.సాత్విక్, ఎ.అఖిల, ఎస్.ఉమామహేశ్వరరావు వెండి పతకాలు సాధించారని తెలిపారు. పోరంకి పాఠశాలలో డ్రాయింగ్ మాష్టారు పోస్టు ఖాళీగా ఉన్నందున విశ్రాంత డ్రాయింగ్ మాష్టారు అరేపల్లి అప్పారావు విజయవాడ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనంపై ఉచితంగా శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. అప్పారావుతో పాటు విద్యార్థులను అభినందించారు.

నేడు కంకిపాడు ఎస్సీ కాలనీలో ప్రచారం

కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడు ఎస్సీ కాలనీలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తునున్నట్లు మంత్రి జోగి రమేష్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఎస్సీ కాలనీలో ఇంటింటి ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ప్రచారంలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తారని పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, శ్రేణులు ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



హనుమాన్‌జంక్షన్ రూరల్: అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం అధికారి జీఆర్ మోహనరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక విజయవాడ రోడ్డులోని మారుతీ గ్యాస్ ఏజెన్సీలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్యాస్ ఏజెన్సీలో కానీ, ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ల వల్ల అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను గ్యాస్ ఏజెన్సీ సిబ్బందికి వివరించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన నియంత్రణ చర్యలను, మంటలను అదుపు చేసే పద్ధతులను ప్రత్యక్షంగా ప్రదర్శనల ద్వారా తెలియజేశారు. ఆ తర్వాత బాపులపాడులోని జెడ్పీ హైస్కూల్‌లోనూ విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన సదస్సును నిర్వహించారు.

ఘనంగా ముగిసిన వసంత నవరాత్రి ఉత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన గురువారం వసంత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. అమ్మవారికి విశేషంగా చీరలతో అర్చనలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

అలరించిన మ్యాజిక్ షో



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీ కోదండ రామాలయం శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం టీవీ మిమిక్రీ ఆర్టిస్ట్ శ్రీనివాస్ చేసిన మిమిక్రీ భక్తులను అలరించింది. శ్రీనివాస్ చేసిన మ్యాజిక్, ఇంద్రజాల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా పెద్ద సంఖ్యలో భక్తులు, కళాభిమానులు మిమిక్రీ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. అనంతరం మిమిక్రీ శ్రీనివాస్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యాన సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.వీర్రాజు, గంగిశెట్టి సాంబశివరావు పర్యవేక్షించారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు

ఉంగుటూరు: ఉచిత పశు వైద్యశిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.వి.ఎస్ కిశోర్ తెలిపారు. పెద్ద అవుటపల్లిలో ఎన్టీఆర్ పశు వైద్య కళాశాల, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని కిశోర్ అల్లాపురం సహాయ సంచాలకులు డాక్టర్ రాధాకృష్ణతో కలిసి ప్రారంభించారు. శిబిరంలో 56 గేదెలకు గర్భకోశ సంబంధిత వ్యాధులకు, 20 గేదెలకు సాధారణ వ్యాధులు, 35 గేదెలకు నట్టల నివారణ మందులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్లు ఎస్.లక్ష్మిరాణి, డి.శ్రీనివాస్ కుమార్, ఎం.మల్లికార్జునరావు, ఐ.వసంత, కళాశాల బోధన సిబ్బంది, డాక్టర్లు ఎం.శ్రీనివాసరావు, రమేష్, వాణి, పశు వైద్యులు నాగార్జున, సుదీర్, కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాల అమలు

- గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్
- నున్నలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



నున్నలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం వంశీమోహన్ నున్న ఇందిరాకాలనీ, టీచర్స్ కాలనీ, పాత ఎస్సీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా వంశీమోహన్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాలకు అమలు చేయని విధంగా వైఎస్సార్ సీపీ సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు ప్రజలకు అవసరమైన గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతుభరోసా కేంద్రాలు, నాడు–నేడులో తరగతి గదుల నిర్మాణాలు ఈ విధంగా అనేక అభివృద్ధి పనులను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని వంశీ ఓటర్లను విజ్ఞప్తి చేశారు.

పార్టీలో చేరికలు

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వంశీమోహన్ ప్రజలకు తెలియజేశారు. ఎన్నికల ప్రచారంలో అనేక మంది మహిళలు వంశీమోహన్‌కు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఎస్సీ కాలనీకి చెందిన పరస చైతన్య, అవుతు నాగిరెడ్డి, పలువురికి వంశీమోహన్ వైఎస్సార్ సీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో విజయవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, ఎంపీటీసీ సభ్యులు పోలారెడ్డి ప్రసాద్‌రెడ్డి, బొంతు సరోజిని, జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, గ్రామ సర్పంచ్ కాటూరి సరళ, పార్టీ మండల అధ్యక్షుడు శీలం రంగారావు, మండల కన్వీనర్ దేవగిరి ఓంకార్‌రెడ్డి, నున్న గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, కాటూరి శ్రీనివాస్, గన్నవరం నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి ఆర్‌వీఆర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తగరం రవీంద్ర, ట్రేడ్ యూనియన్ మండలాధ్యక్షుడు గుడ్డేజి రాజేష్, జీతం శ్రీనివాసరావు, భీమవరపు శివరామిరెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

గన్నవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. తొలి రోజు మూడు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ గీతాంజలిశర్మకు అందజేశారు. యార్లగడ్డకు డమ్మీగా ఆయన సతీమణి జ్ఞానేశ్వరి మరో సెట్ నామినేషన్ సమర్పించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయానికి 100 మీటర్ల వరకు ఆంక్షలు విధించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థితో పాటు పరిమిత సంఖ్యలో నేతలను అనుమతిస్తున్నారు.

పెనమలూరులో నామినేషన్లు నిల్

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గం (78)లో మొదటి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి డి.రాజు వివరాలు తెలుపుతూ భారత ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం గురువారం నుంచి నామినేషన్లు వేయటానికి అవకాశం ఉందన్నారు.



పెనమలూరులో సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్వో రాజు, ఏఆర్వోలు ప్రసాద్, కుమార్‌బాబు

అయితే మొదటి రోజు ఎవరు నామినేషన్లు దాఖలు చేయలేదని తెలిపారు. అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు పెనమలూరులో తన కార్యాలయంలో నామినేషన్లు వేయాలని సూచించారు. ఈ నెల 21వ తేదీన ఆదివారం సెలవు సందర్భంగా నామినేషన్లు స్వీకరించమన్నారు. నామినేషన్లకు చివరి తేదీ ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉందని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు సకాలంలో వారి నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు. ఏఆర్వోలు ప్రసాద్, కుమార్‌బాబు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పెరుగుతున్న పుల్లయ్య చిట్టీల బాధితులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో చిట్టీల వ్యాపారం పేరుతో రూ.కోట్లలో సొమ్ము వసూలు చేసి పరారైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తురకా పుల్లయ్య బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే స్థానిక విజయవాడరోడ్డులో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర చిట్‌ఫండ్స్ కంపెనీ ప్రారంభించి తోటి టీచర్లు, ఉద్యోగులను నమ్మించి రూ.కోట్లలో చిట్టీలు, డిపాజిట్లు కట్టించుకుని చివరికి ఉడాయించిన విషయం విదితమే. పక్కా పథకం ప్రకారం ముందస్తుగా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ(వీఆర్ఎస్) చేయటంతో పాటు స్థిరాస్తులను ఇతర కుటుంబ సభ్యుల పేరిట బదలాయించి తురకా పుల్లయ్య, ఆయన కుమారుడు అశోక్ రాజు కుటుంబాలు పారిపోయారు. విషయం బయటపడటంతో ఒక్కొక్కరిగా బాధితులు బయటకు వస్తున్నారు. ఇప్పటికే తురకా పుల్లయ్య బాధితుల సంఘం పేరిట హనుమాన్‌జంక్షన్ పోలీసులకు శ్రీలక్ష్మీ వెంకటేశ్వర చిట్‌ఫండ్స్ మోసాలపై ఫిర్యాదు చేశారు. దీంతో రోజుకు కనీసం 10 మంది బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లబోదిబోమంటున్నారు. ప్రభుత్వ టీచర్ అనే నమ్మకంతో తమ జీతం, పెన్షన్ సొమ్ములను పిల్లల చదువులు, కుమార్తె పెళ్లి, ఇంటి నిర్మాణ అవసరాల కోసం చిట్‌ఫండ్ కంపెనీలో చిట్టీలు, డిపాజిట్ల పేరిట దాచుకున్నామని వాపోతున్నారు. తీరా ఇప్పుడూ తురకా పుల్లయ్య గుట్టుచప్పుడు కాకుండా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి కుటుంబంతో సహా పారిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ హనుమాన్‌జంక్షన్ పోలీసులను 55 మంది పుల్లయ్య బాధితులు ఆశ్రయించారు. చిట్‌ఫండ్స్ కంపెనీ పాసుపుస్తకం, రశీదులతో పాటుగా డిపాజిట్లకు పుల్లయ్య ఇచ్చిన చెక్కులు, ప్రామిసరీ నోట్లు పోలీసులకు పరిశీలిస్తున్నారు.

సమాజంపై అవగాహన అవసరం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నేటి తరం విద్యార్థుల్లో సమాజంపై అవగాహన పెరగాలని రోటరీ క్లబ్-3020 గవర్నర్ రావూరి వెంకట సుబ్బారావు సూచించారు. గాంధీనగర్‌లోని చిట్టూరి పబ్లిక్ స్కూల్ సమావేశ మందిరంలో ఆయన గురువారం విద్యార్థులతో సమావేశమై ప్రసంగించారు. రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యమైన పోలియో నిర్మూలన అంశంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాయన బాబ్జి మాట్లాడుతూ.. క్లబ్ నిరంతర కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థుల కోసం దంత, నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. సెక్రటరీ ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సత్యనారాయణపురంలోని గాయత్రీ ఫంక్షన్ హాల్‌లో పేదలకు సరుకులు అందించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చిట్టూరి ఆనంద రామ సుధాకర్, అమానుల్లా, పోతిన సురేష్, సుబ్బరాజు, జి.వి.రావు, జె.కె. సుబ్బారావు, ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

అపురూపం.. శ్రీరామ పట్టాభిషేకం



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలు, శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన యల్లాజ్యోసుల అనురాధ బృందం ప్రదర్శించిన శ్రీరామ పట్టాభిషేక నృత్యరూపకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అయోధ్యలో పుత్రకామేష్టి యాగం, రామ లక్ష్మణ, భరత, శత్రుఘ్నల జననం, యాగ రక్షణ, సీతా స్వయంవరం, అరణ్యవాసం, రామ రావణయుద్ధం, శ్రీరామ పట్టాభిషేకం వంటి అంశాలను చక్కటి నృత్య రూపకంలో ప్రదర్శించారు. అనంతరం కళాకారులకు ఆలయ ఈవో రామరావు సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు.

సంక్షేమ పాలన వైఎస్సార్ సీపీతోనే సాధ్యం



గన్నవరంలో కరపత్రాలను అందజేస్తున్న జెడ్పీటీసీ ఎలిజబెత్‌రాణి, నాయకులు



ముస్తాబాదలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

గన్నవరం: ప్రజా సంక్షేమ పాలన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌కు మద్దతుగా గురువారం పట్టణ పార్టీ నేతలు స్థానిక రాయ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం వైఎస్. జగన్‌కు దక్కుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అన్ని రకాలుగా అండగా ఉంటున్న వంశీమోహన్‌ను, సింహాద్రిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు పోనగంటి శివ, బూసిరెడ్డి, సూరెడ్డి మణిమ్మ, కుర్రాటి అరుణకుమారి, కాటం కిషోర్, బర్మా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాదలో ప్రచారం

గన్నవరంరూరల్: సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని ముస్తాబాద సహకార బ్యాంకు చైర్మన్ మేడసాని శ్రీనివాస చౌదరి కోరారు. గ్రామంలోని ఇంటింటికీ గురువారం రాత్రి వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి, వైఎస్సార్ సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ప్రచార కరపత్రాలు అందజేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించి మరింతగా సంక్షేమం ప్రజలకు అందేందుకు అందరూ కృషి చేయాలన్నారు. పాఠశాలలు, ఆస్పత్రులు, వైద్య సేవలు, ఆర్‌బీకేలు, సచివాలయంలో సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్‌లు, పేదలకు ఇళ్లు, అమ్మ ఒడి, చేయూత వంటి పథకాలను గడిచిన 70 ఏళ్ల కాలంలో ప్రజలు చూడలేదని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, వంశీమోహన్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్, మాజీ సర్పంచ్ కైలే ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ మున్ని, నాయకులు కూరేటి శ్రీకాంత్, బొమ్మారెడ్డి వెంకట నరసింహారెడ్డి, షేక్ బాజీ, గంగవరపు ప్రదీప్ దాస్, మహిళలు పాల్గొన్నారు.

వలంటీర్లకు అండగా ఉంటాం



గంగూరులో రాజీనామా చేసిన వలంటీర్లతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: వలంటీర్లకు జగనన్న అండగా ఉంటారని, రానున్న జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లకు పూర్తి న్యాయం చేస్తామని మంత్రి, ఎమ్మెల్యే అసెంబ్లీ అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ సీపీ గంగూరు కార్యాలయానికి గురువారం పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలలో రాజీనామా చేసిన వలంటీర్లు పెద్ద సంఖ్యలో వచ్చి మంత్రి జోగి రమేష్‌ను కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు సేవ చేయటానికి వలంటీర్లను రంగంలోకి దించారన్నారు. గడిచిన ఐదేళ్ల వలంటీర్లు సేవా భావంతో అర్హులైన పేదలను గుర్తించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వానికి వారధులుగా పని చేశారన్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు చేసి ఓర్వలేక చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వలంటీర్ల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడి తప్పుడు ఆరోపణలు చేశారని విమర్శించారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్ల సేవలు అడ్డుకోని పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఈ ఎన్నికల్లో మళ్లీ జగనన్న సీఎంగా అయిన వెంటనే వలంటీర్లకు మంచి భవిష్యత్ లభిస్తుందని హామీ ఇచ్చారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామా

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. యనమలకుదురు గ్రామంలో గురువారం 10 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. యనమలకుదురు సచివాలయం -5లో పని చేస్తున్న 10 మంది వలంటీర్లు ఈ మేరకు రాజీనామా పత్రాలు అధికారులకు సమర్పించారు. చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్‌లు తాము ప్రజలకు చేస్తున్న సేవలను వక్రీకరించి తమపై నిందలు వేసి తమను తీవ్ర మనస్థాపానికి గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదవులకు రాజీనామా చేసి జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచామని ప్రకటించారు. జగనన్న గెలుపునకు కృషి చేస్తామన్నారు.

వలంటీర్లకు మద్దతు..

రాజీనామా చేసిన వలంటీర్లకు తాము అండగా ఉంటమని గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. నాయకుడు ఈడే గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉయ్యూరు పరిధిలో 38 మంది రాజీనామా

ఉయ్యూరు: మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో 22 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను గురువారం సచివాలయ కార్యదర్శికి అందజేశారు. మండలంలోని గండిగుంట గ్రామంలో 16 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. పలు గ్రామాల్లో వలంటీర్లు రాజీనామాలను సంబంధిత కార్యాలయాల అధికారులకు అందించారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామాలు

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామాలు సమర్పించారు. జగనన్న సైన్యంగా పనిచేస్తామని, నియోజకవర్గంలో జోగి రమేష్ విజయం కోసం శ్రమిస్తామని స్పష్టంచేశారు. మద్దూరు సర్పంచ్ చిప్పల రామదాసు, పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి నాగిడి సాంబశివరావు, నాయకులు లంకె రాజ్‌కమల్, పొనమాల ఆంజనేయులు పాల్గొన్నారు. కుందేరులో ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి సమక్షంలో వలంటీర్లు తమ రాజీనామాలను సమర్పించారు. గొడవర్రు, ఈడుపుగల్లు గ్రామాలకు చెందిన వలంటీర్లు అధికారులకు రాజీనామాలను అందజేశారు.

కేబీఎన్ కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సౌకర్యార్థం కేబీఎన్ కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలను ఉత్తీర్ణులైన విద్యార్థులు ముందు ఏ కోర్సులు తీసుకోవాలో వివరిస్తామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 91829 07747, 94947 59593 నంబర్లలో సంప్రదించాలని కోరారు.